నేడు బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

కవాడిగూడ: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లు పెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ కోరారు. ఈ మేరకు బీసీ కులసంఘాలతో గురువారం ఖైరతాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ మాజీ సభ్యుడు బండ ప్రకాష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. సమావేశానికి మేధావులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన సాంకేతికతో పటిష్ట నిర్మాణాలు

రాయదుర్గం: కాంక్రీట్ నిర్మాణాల్లో వస్తున్న నూతన సాంకేతిక విధానంతో పటిష్టమైన నిర్మాణాలు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ ఇన్ కాంక్రీట్ టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అనే అంశంపై బుధవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో విభిన్నమైన తరహాలో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దేవశ్రీఇస్పాత్ లిమిటెడ్ టెక్నికల్ మార్కెటింగ్ హెడ్ రాజీవ్‌సింగ్‌బిస్త్ మాట్లాడుతూ.. భారీ కాంక్రీట్ నిర్మాణాల వలన ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా ఆయా నిర్మాణాలు మరింత ఎక్కువ కాలం నిలబడేలా ప్రస్తుత నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భవన నిర్మాణరంగంలో నూతన శాస్త్ర సాంకేతిక విధానాలు వస్తున్నాయన్నారు. ప్రతి నిర్మాణం ఎక్కువకాలం మన్నిక ఉండేలా నిర్మాణశైలిలో మార్పులను చేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్స్‌లో ఉత్తమ ప్యాకేజీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని చిన్మయికి సర్వీస్‌నౌ కంపెనీలో ఏడాదికి రూ.47 లక్షల ప్యాకేజీతో కూడిన ఉద్యోగం లభించింది. హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్ చరిత్రలో ఇది ఇప్పటి వరకు అత్యధిక ప్యాకేజీ అని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్‌లో ఎంటెక్-ఐటీ గ్రాడ్యుయేట్ అయిన చిన్మయి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా బొటానికల్ గార్డెన్

టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్

గచ్చిబౌలి: భవిష్యత్తులో చెట్ల పరిశోధన చేసేందుకు బొటానికల్ గార్డెన్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని టీఎస్ఎఫ్‌డీసీ ఏకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 50 అరుదైన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో ఇప్పటి వరకు 1200 జాతుల మొక్కలు నాటమని, మొత్తం 1250 జాతుల మొక్కలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో బొటానికల్ గార్డెన్‌ను ప్రకృతి పర్యాటక, చెట్లమీద పరిశోధనకు అనుగుణంగా ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దుతామన్నారు. పరిశోధనకు 75 రకాల థీమ్‌లను సందర్శించే వారి కోసం బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

మాన్‌సూన్ బృందాలేవీ?

- రూ.2.09 కోట్లతో మాన్‌సూన్ నిర్వహణ టెండర్లు
- ఫిర్యాదులను స్వీకరించే విషయంలో నిర్లక్ష్యం
- చెట్ల కొమ్మలు విరిగినా.. వర్షపునీరు నిలిచినా పట్టించుకోని వైనం
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తులు



కుత్బుల్లాపూర్: కోట్లు ఖర్చుపెట్టి నియమించిన మాన్‌సూన్ బృందాలు ప్రజల ఫిర్యాదులను స్వీకరించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షం పడి ఇబ్బందులు ఏర్పడితే తమకు ఫోన్ చేయండి.. వెంటనే స్పందిస్తామంటూ చెబుతున్నా అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షం వల్ల జంట సర్కిళ్లలోని పలు డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి.. వర్షం నీరు వివిధ ప్రాంతాల్లో చేరింది.

అత్యవసర సేవా బృందాలకు ఫోన్ చేసినా..

◆ ఈ విషయంపై లోతట్టు ప్రాంతాల ప్రజలు మాన్‌సూన్ అత్యవసర సేవా బృందాలకు ఫోన్ చేసినా స్పందించడం లేదని పలువురు వాపోతున్నారు. సహాయక చర్యల్లో పాల్గొనాల్సిన సిబ్బంది పత్తలేకుండా పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం ఆది, సోమవారాల్లో పలు ప్రాంతాల్లో రహదారులు రాకపోకలు నిలిచిపోవడం విశేషం. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కోట్లు ఖర్చుపెట్టిన ఫలితం లేకుండా పోతుంది...

◆ గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న చింతల్, రంగారెడ్డినగర్, జగద్గిరిగుట్ట, గాజులరామారం, కుత్బుల్లాపూర్, సుభాష్‌నగర్, సూరారం, జీడిమెట్ల 8 డివిజన్లలో లోతట్టు ప్రాంతాల్లో భారీ వర్షం వల్ల వరదలు ముంచెత్తినప్పుడు అత్యవసర బృందాల ఖర్చు కోసం రూ.2.09 కోట్లతో మాన్‌సూన్ కోసం ఇటీవల టెండర్లు నిర్వహించి వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించారు.

వర్షాకాలం ప్రారంభ దశలోనే నిర్లక్ష్యం..

◆ ఒక్కో బృందానికి నలుగురు చొప్పున రెండు షిఫ్ట్‌లో 8 మందిని పెట్టి సేవలందించే కార్యాచరణ రూపొందించినప్పటికీ వర్షాకాలం ప్రారంభ దశలోనే వీరి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపించింది. వర్షాలు పడే రోజుల్లో 24/7 గంటల పాటు జంట సర్కిళ్ల పరిధిలో అనునిత్యం వచ్చే ఫోన్ కాల్స్‌ను గుర్తించి అత్యవసర సమయాల్లో వీరి సేవలు వినియోగిస్తారు.

◆ కానీ ఆదివారం పలుచోట్ల కురిసిన వర్షం, ఈదురుగాలులతో చెట్లు విరిగిపడ్డా మాన్సూన్ సిబ్బంది స్పందించకపోవడంపై విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. ఫిర్యాదు వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లి రోడ్లపై నిలిచిన నీటితో పాటు కాలనీలో వచ్చే నీటిని తరలించే ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత వీరిది.

◆ కానీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల వీరి సేవలను కాలనీ ప్రజలు అందుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

పీసీబీ అధికారి జి.హన్మంతరెడ్డి



నిజాంపేట్‌లో మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పీసీబీ, జేఏఐ ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ

జీడిమెట్ల: పరిశ్రమలు కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఉత్పత్తులను చేపట్టాలని పీసీబీ అధికారి జి.హన్మంతరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పీసీబీ, జేఏఐ ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. 'నేలల పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకుని అధిగమించడం'అనే అంశంపై పలు సూచనలు చేశారు. పరిశ్రమ యాజమానులు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం..

పర్యావరణాన్ని కాలుష్య కారకాల నుంచి కాపాడుకోవడం మానవ ధర్మమని మేడ్చల్ జిల్లా పీసీబీ అధికారి రాజేందర్ అన్నారు. పరిశ్రమల యాజమాన్యం పర్యావరణాన్ని రక్షించేందుకు పరిశ్రమల్లో కాలుష్యాన్ని నియంత్రించే యంత్రాలను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జీడిమెట్ల ఇండస్ట్రియల్ అథారిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, జేబీటీఎల్ డైరెక్టర్ బక్కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే..

సుభాష్‌నగర్: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీటిని అందించగలుగుతామని పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సూరారంలోని తన ఇంటి పైభాగంలో తన తండ్రి ఈశ్వరయ్య, మనుమలు ఈస్వానీ, జయశ్రీ, రిధికృష్ణ, ధిరణ్ సాయిలతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

దుండిగల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని మేడ్చల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గండిమైసమ్మలోని వృద్ధాశ్రమంలో మొక్కలను నాటారు. హరితాహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాత్విక్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి రెండు మొక్కలు నాటాలి...

నిజాంపేట్: రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చెట్లను పెంచి తగ్గించవచ్చని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిజాంపేట్‌లోని తన ఇంటి ఆవరణలో ఆయన మొక్కలు నాటారు.

◆ ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... చెట్లను విచక్షణారహితంగా నరికివేయడంతో నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికి రెండు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాడి మహేష్, లింగాల గంగాధర్, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, ప్రశాంత్ రెడ్డి, సర్ల లక్ష్మణ్, శివ నాగరాజు యాదవ్, మురళీచారి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి



మేడపై మొక్కలు నాటుతున్న పర్యావరణ ప్రేమికుడు రవీందర్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు

నాలాల్లో వ్యర్థాలు తొలగించాలి

- వరదనీరు సాఫీగా వెళ్లేలా చూడాలి
- విన్నవిస్తున్న వెంకటాద్రినగర్ వాసులు

జీడిమెట్ల: భారీ వర్షాలు పడకముందే నాలాల్లో చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సుభాష్‌నగర్‌లోని వెంకటాద్రినగర్ పక్కన ఉన్న నాలాలో చెత్తాచెదారాలు విపరీతంగా పేరుకుపోయాయి. నాలాల్లో ఉన్న చెత్తను తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికే నగరంలో వానలు మొదలయ్యాయి. ఔట్‌లెట్‌లు చెత్తతో మూసుకుపోవడంతో చిన్నపాటి వర్షాలకే నాలాల్లోని నీరు ఇళ్లల్లోకి వస్తోంది. వర్షపునీరు రావడంతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది.

వెంటనే నాలాల్లోని చెత్తను తీసివేయాలి..

వెంకటాద్రినగర్ నాలాలో ఉన్న చెత్తను వెంటనే తొలగించకపోతే వర్షాకాలంలో భారీ నష్టం తప్పదని కాలనీవాసులు అంటున్నారు. మూసుకుపోయిన ఔట్‌లెట్‌లను అదేవిధంగా నాలాల్లో ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

టీహబ్‌ను సందర్శించిన ప్రముఖులు

రాయదుర్గం: టీహబ్ ప్రాంగణాన్ని దేశంలోని వారే కాకుండా విదేశాలకు చెందిన వారు కూడా నిత్యం సందర్శించడం ఆనవాయితీగా మారింది. దీనిలో భాగంగా ఒరికా సంస్థకు చెందిన బృందం, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అంగస్ మెల్‌బోర్న్, రీసెర్చ్ ఇన్నోవేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆడమ్ మూనీ కలిసి టీహబ్‌ను సందర్శించారు. ఈ మేరకు టీహబ్ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరస్పరం సహకారం విషయంలో రెండు సంస్థలు కలిసి పనిచేయాలని, టీహబ్-ఒరికా మధ్య సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

గెలిచారని టపాసులు కాల్చారు.. కాల్చొద్దంటూ గొడవకు దిగారు

పరస్పర ఫిర్యాదులతో ఇరు వర్గాలపై కేసు నమోదు

దుండిగల్: ఎన్నికల ఫలితాల అనంతరం సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలను మరో వర్గం అడ్డుకుంది. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో దాడులు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు దుండిగల్ పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందడంతో శంభీపూర్ గ్రామంలో బీజేపీ నేతలు క్యాసారం శ్రీనివాస్, సోనులతో పాటు మరికొందరు స్థానికంగా ఉన్న హనుమాన్ గుడి వద్ద సంబరాలు చేసుకుంటున్నారు.

◆ ఇదే సమయంలో స్థానికంగా ఉండే క్యాసారం చంద్రశేఖర్‌తో పాటు మరి కొందరు అక్కడికి చేరుకుని టపాసులు కాల్చవద్దని వారించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవలు చెలరేగి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంబరాలు చేసుకుంటున్న తమపై అకారణంగా బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడ్డారని.. తమను తీవ్రంగా గాయపర్చారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.

డబ్బులు అడిగినందుకు కార్మికులపై దౌర్జన్యం

సెంట్రింగ్ బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు

సుభాష్‌నగర్: చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించడమే కాకుండా సెంట్రింగ్ కార్మికులను బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న మన్సూమ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఐ నాయకులు ఆందోళనకు దిగారు. గాజులరామారం పరికి చెరువు వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ.. సెంట్రింగ్ కార్మికులతో పనులు చేయించుకున్న యాజమాన్యం డబ్బులు అడిగితే దౌర్జన్యానికి దిగుతోందన్నారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందన్నారు. సీపీఐ మండల కోశాధికారి సదానంద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సెంట్రింగ్ కార్మికులకు అండగా నిరసన చేపట్టిన సీపీఐ నాయకులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యం



మాణిక్యం (ఫైల్)

జగద్గిరిగుట్ట: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రెడ్ బిల్డింగ్స్‌లో నివాసముండే మాణిక్యం (55) భార్య మూడేళ్ల క్రితం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న మాణిక్యం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇటీవల అతడి కుమార్తె పద్మ పలుమార్లు మొబైల్ ఫోన్‌కు యత్నించినా కలవడం లేదు. దీంతో బుధవారం మాణిక్యం ఉంటున్న భవనం వద్దకు వచ్చి ఆరా తీయగా ఇంటికి రావడం లేదని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



పావని(ఫైల్)

జగద్గిరిగుట్ట: ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవి హిల్స్‌కు చెందిన మీరేష్‌గౌడ్, పావని(33)లు భార్యాభర్తలు. కాగా ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు మీరేష్‌గౌడ్ డ్యూటీకి వెళ్లగా పావని ఇంట్లో ఉంది. సాయంత్రం 7గంటలకు వీరి కుమారుడు విశ్వతేజ ఇంటికి వచ్చేసరికి తల్లి కనబడలేదు. అయితే మొబైల్ ఇంట్లో వదిలి వెళ్లిన పావని, మొబైల్ నుంచి తన చెల్లెలుకు వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పంపింది. అప్పుల బాధలు ఎక్కువయ్యాయని అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని మెసేజ్‌లో తెలిపింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న వాచ్‌మెన్ పై నుంచి వెళ్లిన రెడీమిక్స్ వాహనం

అక్కడికక్కడే మృతి.. కేసు నమోదు



హరిరామ్‌సింగ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: నిర్మాణ భవనం వద్ద పడుకుని ఉన్న వాచ్‌మెన్ మీది నుంచి రెడీమిక్స్ వాహనం వెళ్లడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలో మైస్పేస్ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళ అంతుస్తుల భవనం వద్ద బిహార్ రాష్ట్రానికి చెందిన హరిరామ్‌సింగ్(40) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం భవనం వద్ద పడుకుని ఉండగా కాంక్రీట్ వేసేందుకు వచ్చిన రెడీమిక్స్ వాహన డ్రైవర్ వెనక్కి తీసే క్రమంలో హరిరామ్‌సింగ్‌ను గుర్తించకుండా అతడిపై నుంచి పోనిచ్చాడు. దీంతో వాహన రెండు టైర్లు అతడి మీది నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయాలి

కాచిగూడ: తెలంగాణలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ మహిళా జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మట్ట జయంతి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా కొన్ని ముఖ్యమైన శాఖలకు మంత్రులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ హవా

- 18 రౌండ్‌లలో ఆధిక్యాన్ని ప్రదర్శించిన బీజేపీ
- కేవలం రెండు రౌండ్‌లలోనే కాంగ్రెస్ ఆధిక్యం
- మొత్తంగా రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్
- 1,77,122 లక్షల ఓట్లను కొల్లగొట్టిన ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ఒకవైపు ప్రధాని మోదీ చరిష్మాతో మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ దూసుకుపోయింది. అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్లల్లో లక్షకుపైగా కాంగ్రెస్ పార్టీ ఓట్లు సాధించింది. అయితే కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా 1,20,957 ఓట్లు సాధించగా.. మేడ్చల్‌లో 1,19,125 ఓట్లను రాబట్టుకుంది. మిగిలిన అన్నిచోట్ల 45వేలు మొదలుకుని 84వేల వరకు ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలిచింది.

కాంగ్రెస్‌కు అసెంబ్లీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో 20వేలకు పైగా ఓట్లు..

◆ ఒకవైపు బీజేపీ గాలి.. మరోవైపు బీఆర్ఎస్ ఓట్లు బీజేపీ వైపు వెళ్తున్న సమాచారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తమై ప్రచారాన్ని ఉధృతం చేయడంతో కుత్బుల్లాపూర్‌లో లక్షకు పైగా ఓట్లు సాధించామని ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలో ఉన్న కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరి తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించడంతో లక్షకు పైగా ఓట్లు సాధించడమే కాకుండా తన ఓటు బ్యాంకును కాపాడుకోగలిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లకు మించి 20 వేలకు పైగా అదనంగా ఓట్లు రావడం విశేషం.

20 రౌండ్లలో బీజేపీ.. 2రౌండ్లలో కాంగ్రెస్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 28 టేబుళ్లల్లో 22 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొదటి 10రౌండ్లలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆధిక్యత ప్రదర్శించారు. 11, 12వ రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి 3828 ఓట్ల మెజార్టీ సాధించింది.ఆ తర్వాత 13 నుంచి 22 రౌండ్ల వరకు బీజేపీ ఆధిక్యత కొనసాగుతూ ముందుకు సాగింది. ఇలా మొత్తం 1,77,122లక్షల ఓట్లు వారి ఖాతాలో పడ్డాయి.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కూన

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎనిమిది స్థానాలు కైవసం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌లు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్



సూరారం చల్లా లక్ష్మీశ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

అన్నదానం

సుభాష్‌నగర్: సూరారం ప్రాంతానికి చెందిన చల్లా లక్ష్మీశ్రీనివాస్‌యాదవ్ తన కుమార్తె సంజన జన్మదినాన్ని పురస్కరించుకుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. మీ కోసం ఫౌండేషన్ చైర్మన్ కట్ట బోయిన శివయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నల్లమల్ల కోటేశ్వరరావు, సభ్యులు స్రవంతి ట్రాఫిక్ పోలీస్ శ్రీ, చల్లా శ్రీనివాస్ యాదవ్, ఓంకార్, శశి కుమార్, నర్సింగ్, బత్తుల అయ్యప్ప, ఎండి షరీఫ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షల వెల్లువ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, భరతసింహారెడ్డి



ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న ఎస్.మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు బీజేపీ నేతలు, కార్యకర్తల నుంచి శుభాకాంక్షలు, అభినందనలు వెల్లువెత్తాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బుధవారం ఈటల రాజేందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, జీడిమెట్ల కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్, బక్క శంకర్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

◆ అదే విధంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బుధవారం భరతసింహారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సూరారం చౌరస్తాలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వరాల మహేశ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈటలకు భగవతి స్వామిజీ ఆశీర్వచనాలు..

నిజాంపేట్: మల్కాజిగిరి ఎంపీగా ఘన విజయం సాధించిన ఈటల రాజేందర్ బుధవారం భగవతి స్వామిజీని కలిసి ఆయన ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అఖండ విజయాన్ని అందించిన మల్కాజిగిరి లోక్‌సభ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



సూరారంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వరాల మహేశ్



స్వామిజీ ఆశీస్సులు తీసుకుంటున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్